# మెరుగైన వేతన సవరణ కోసం 19-20 మే 2009 రెండు రోజుల సమ్మె

## సమ్మె డిమాండ్లపై వివరణ

### *నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల వేతన సవరణ వెంటనే జరగాలి*

బిఎస్ఎన్ఎల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు వేతన సవరణ 1.1.2007 నుండి జరుగవలసి వుంది. మేనేజ్‌మెంటు గుర్తింపు పొందిన యూనియన్‌తో ఒక ప్రాథమిక సమావేశాన్ని 11.1.2008న నిర్వహించింది. తిరిగి ఇదే రకమైన సమావేశాన్ని 15.12.2008న నిర్వహించింది. నిజానికి వేతన చర్చలు 3.3.2009న ప్రారంభమై ఆరు దఫాలుగా కొన సాగినా ఉద్యోగుల న్యాయబద్ధమైన డిమాండ్లు నెరవేర్చ డానికి మేనేజ్‌మెంటు విముఖంగా వున్న కారణంగా, ఈ చర్చల వల్ల పెద్దగా ఫలితం రాలేదు. ఉద్యోగుల న్యాయ మైన డిమాండ్లను అంగీకరిస్తూ వేతన సవరణను వెంటనే పూర్తిచేయాలని యూనియన్ డిమాండ్ చేస్తోంది.

### *వేతన సవరణ కాలపరిమితి ఐదు సం॥లుగా ఉండాలి*

ప్రభుత్వరంగ సంస్థలలో 1971 నుండి 1996 వరకు ఐదుసార్లు, నాన్ ఎగ్జిక్యూటివ్‌ల గుర్తింపు పొందిన యూనియన్‌తో చర్చించిన అనంతరం వేతనాలు సవరించ బడ్డాయి. 1.1.1997 నుండి అమలులోకి వచ్చిన ఆరవ వేతన సవరణ మాత్రం ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థల కార్మిక వ్యతిరేక విధానాలకు లోబడి ప్రభుత్వం వేతన సవరణ కాలపరిమితి పది సం॥లుగా నిర్ణయించబడింది. పర్యవసానంగా ఏడవ వేతన సవరణ ఐదు సం॥ల కాలపరిమితితో 1.1.2002 నుండి కాకుండా- పది సం॥ల కాలపరిమితితో 1.1.2007 నుండి అమలులోకి వస్తున్నది. 1.1.2007 నుండి జరుగవలసిన ఏడవ విడత వేతన సవరణకు కూడా ఉద్యోగ వ్యతిరేకమైన పది సం॥ల కాలపరిమితినే ప్రభుత్వం వర్తింపజేసింది. సిపిఎస్‌టియు (కమిటీ ఆఫ్ పబ్లిక్ సెక్టర్ ట్రేడ్ యూనియన్స్) ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వరంగ సంస్థలలోకి నాన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్లు ఐక్యంగా ఐదు సం॥ల కాలపరిమితి, పునరుద్ధరణ కోసం పోరాడాలని నిర్ణయించాయి. తదనుగుణంగా వివిధ ప్రభుత్వరంగ సంస్థలలోని యూనియన్లు (బిఎస్ఎన్ఎల్‌తో సహా) 7.5.2008న ఒకరోజు సమ్మెకు నోటీసు ఇచ్చాయి. ఈ సమ్మెను నివారించడానికి ప్రధానమంత్రి సిపిఎస్‌టియు ప్రతినిధి బృందంతో చర్చలు జరిపారు. ఈ సమావేశంలో ప్రధానమంత్రి ఇచ్చిన హామీ ఫలితంగా డిపార్టుమెంటు ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ వేతన ఒప్పందాలలో ఐదు సంవత్సరాల కాలపరిమితిని అనుమతిస్తూ 1.5.2008న ఉత్తర్వులు జారీ చేసింది. బిఎస్ఎన్ఎల్ మేనేజ్‌మెంటు కూడా సూత్రప్రాయంగా ఐదు సంవత్సరాల కాలపరిమితికి అంగీకరించింది.

అయితే ఐదు సంవత్సరాల కాలవ్యవధితో వేతన సవరణకు 30% ఫిట్‌మెంటు బెనిఫిట్‌కి బదులుగా 10% ఫిట్‌మెంటు బెనిఫిట్ ఇస్తామని అడ్డగోలుగా ప్రతిపాదిం చింది. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఐదు సంవత్సరాల కాలపరిమితితో వేతన ఒప్పందపు హక్కుల్ని కాలరాయాలని చూస్తోంది. గతకాలపు నిజ వేతనాల తగ్గు దలని భర్తీ చేయడానికి మాత్రమే వేతన సవరణ జరుగు తుందనేది నిర్వివాదాంశం. భవిష్యత్తుకాలపు వేతన తగ్గుదల కోసం వేతన సవరణ జరగదు. 1.1.1997 నుండి 1.1.2007 వరకు గత 10 సం॥ల కాలపు వేతనాల తగ్గుదల సవరణ కోసం అధికారులతో, ఉద్యోగులకు వేతనాలు సవరిస్తున్న దృష్ట్యా, ఫిట్‌మెంట్ బెనిఫిట్ ఇద్దరికీ సమానంగా పెరగ వలసి వుంది. దీనికి వేతన సవరణ కాలపరిమితికి సంబంధం లేదు. క్రిందిస్థాయి అధికారులకు 30%, ఉన్నత స్థాయి అధికారులకు 50% నుండి 60% ఫిట్‌మెంట్ బెనిఫిట్ ఇచ్చిన మేనేజ్‌మెంట్, ఐదు సంవత్సరాల కాల పరిమితికి 10% ఫిట్‌మెంట్ బెనిఫిట్ అనే మేనేజ్‌మెంట్ వాదనలో బలం లేదు. ఈ రకంగా వేతన సవరణ కాల పరిమితికి, ఫిట్‌మెంట్ బెనిఫిట్‌కి సంబంధం లేదు.

### *పే+78.2 శాతం పే పై ఉన్నతస్థాయి ఎగ్జిక్యూటివ్స్‌తో సమంగా ఫిట్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వాలి*

గ్రూపు-డి కనీస వేతనం రూ. 4000 మరియు సిఎండి యొక్క గరిష్ట వేతనం రూ. 31,500ల మధ్య నిష్పత్తి 1:7.875గా వుంది. ఇటీవల అధికారులకి జరిగిన వేతన సవరణలో సిఎండి స్కేలు మాగ్జిమం ప్రస్తుతం ఉన్న రూ. 31,500 నుండి 1,25,000కి పెంచబడింది. కనుక ప్రస్తుతం వున్న నిష్పత్తి 1:7.875ని గనక పాటిస్తే, రూ. 1,25,000 వేతనంలో 7.875వ వంతు వేతనాన్ని గ్రూపు-డికి నిర్ణయించాలి. అది రూ. 15,873 అవుతుంది. ఈ ప్రాతిపదికన గ్రూపు-డి

కనీస వేతనాన్ని రూ. 4000 నుండి రూ. 15,873గా సవరించాల్సిన అవసరం వుంది. ఈ రకంగా రూ. 4000 బేసిక్ పే రూ. 15,873కి పెంచాలంటే పే+78.2 శాతం పే పై (వేతన సవరణలో డి.ఎ. మెర్జరు బెనిఫిట్‌ని కలుపుకొని) 122% ఫిట్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వవలసి వుంది. డి.పి.ఇ. 26.11.2008న ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం పే+68.8 శాతం పే పై 30% ఫిట్‌మెంట్ బెనిఫిట్ అని నిజానికి పేర్కొన్న ప్పటికీ, సిఎండి కనీస వేతనం రూ. 27,750కు 78.2 శాతం పే పై 30% ఫిట్‌మెంట్ బెనిఫిట్ కలిపి చూసినా, కనీస వేతనం రూ. 64,290 వస్తుంది కనుక సిఎండి కనీస వేతనం రూ. 64290గా నిర్ణయించబడాలి. కానీ సిఎండి కనీస బేసిక్ పే రూ. 80,000గా నిర్ణయించబడింది. ఈ విధంగా సిఎండి వేతన స్కేలుపై 62% ఫిట్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వబడింది. ఇదేవిధంగా బోర్డు ఆఫ్ డైరెక్టరు స్కేలు మినిమం కూడా బేసిక్ పే + 78.2% పే పై 63% ఫిట్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వ బడింది. బిఎస్ఎన్ఎల్‌లో అధికారులకు మొదట పే+ 68.8% పే పై 30% ఫిట్‌మెంటు బెనిఫిట్ ఇవ్వబడింది. కానీ ఇప్పుడు బిఎస్ఎన్ఎల్ మేనేజ్‌మెంటు కూడా అధికారు లకు బేసిక్ పే+78.2% పే పై 30% ఫిట్‌మెంటు బెనిఫిట్‌తో రివైజ్డ్ ఉత్తర్వులు ఇవ్వాలని చూస్తోంది. కానీ ఇదే సమయం లో నాన్ ఎగ్జిక్యూటివ్స్‌కు ఇదే విధమైన బేసిక్ పే + 78.2% పే పై 30% ఫిట్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వటానికి నిరాకరిస్తూ, మేనేజ్‌మెంటు, ఉద్యోగు లకు తానేదో పెద్ద ఉపకారం చేస్తున్నాననీ, పది సం॥ల కాలపరిమితితో బేసిక్ పే+68.8% పే పై 30% ఫిట్‌మెంట్ బెనిఫిట్ ఇస్తున్నానని ప్రచారం చేస్తోంది. మేనేజ్‌మెంటు ఈ రకంగా ఉద్యోగులను మోసం చేయడం, వివక్షతతో చూడడం మానేసి, బేసిక్ పే+78.2% పే పై ఉన్నతస్థాయి అధికారులతో సమంగా ఫిట్‌మెంట్ బెనిఫిట్ ఇస్తూ ఐదు సం॥ల కాలపరిమితితో వేతన సవరణ చేయాలని యూనియన్ డిమాండ్ చేస్తోంది.

### *వేతన సవరణ ఒప్పందం జరిగి దానిని డిఓటి/డిపిఇ ఆమోదించేలోగా 1.1.2007 నుండి బేసిక్ పేతో 50% లేదా రూ. 3000 ఏది ఎక్కువ అయితే అది ప్రతినెలా ఇంటరిమ్ రిలీఫ్ ఇవ్వాలి*

సాధారణంగా వేతన సవరణ జరగటం ఆలస్యం అయినపుడు ఇంటరిమ్ రిలీఫ్ ఇస్తారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులకు 1.1.2007 నుండి వేతన సవరణ జరగాల్సి వుంది. ఇప్పటికే 28 నెలలు గడిచిపోయాయి. ఈ రకమైన ఆలస్యం జరిగినపుడు మేనేజ్‌మెంటు ఇంటరిమ్ రిలీఫ్ ఇచ్చి వుండాల్సింది. అనేక ఇతర ప్రభుత్వరంగ సంస్థలు ఇంటరిమ్ అడ్వాన్సుగానీ, ఇంటరిమ్ రిలీఫ్‌గానీ ఇదివరకే తమ ఉద్యోగులకు చెల్లించాయి. ఓఎన్‌జిసిలో 2007 సం॥నికి రూ. 30000 నుండి రూ. 60000 అడ్వాన్సు గా చెల్లించి, ఆ తరువాత జనవరి 2008 నుండి ప్రతి నెలా రూ. 2500 నుండి రూ. 4500 ఇంటరిమ్ రిలీఫ్‌గా చెల్లిస్తున్నారు.

బిహెచ్ఇఎల్‌లో రెండుసార్లు అడ్‌హక్ అడ్వాన్సు చెల్లించారు. ఈ మొత్తం రూ.40,000 నుండి రూ. 1,50,000 వరకు వుంది. అనేక ఇతర ప్రభుత్వరంగ సంస్థలలో కూడా తగినంత మొత్తాలను ఇంటరిమ్ రిలీఫ్‌గా చెల్లించడం జరిగింది. కనుకనే మనం బేసిక్ పేలో 50% లేదా రూ. 3000 ఏది ఎక్కువ అయితే అది ప్రతినెలా ఇంటరిమ్ రిలీఫ్ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం. ఇతర ప్రభుత్వరంగ సంస్థలలో ఇదేరకంగా చెల్లించడాన్ని గమనించాలి.

బిఎస్ఎన్ఎల్ మొదట రెండు నెలల బేసిక్ పేని అడ్వాన్సుగా చెల్లించడానికి ముందుకు వచ్చింది. కనీస స్థాయిలో కేవలం రూ. 8000 అడ్వాన్సుగా వస్తుంది. 29.4.2009న జరిగిన సుదీర్ఘచర్చల అనంతరం సిఎండి నాల్గు నెలల బేసిక్ పేని అడ్వాన్సుగా ఇవ్వటానికి అంగీక రించారు. ఇది కనీసస్థాయిలో రూ. 16,000 వస్తుంది. మరీ ఇంత తక్కువ అడ్వాన్సును చర్చలలో యూనియన్ అంగీక రించలేదు. ఇప్పటికే 28 నెలల కాలం గడిచిన దృష్ట్యా నెలలో కనీసం రూ. 1000 అడ్వాన్సుగా లెక్కకట్టినా ఆ మొత్తం రూ. 28000 అవుతుంది. ఇక్కడ గుర్తుంచుకో వాల్సిన అంశం ఏమిటంటే 2000 సం॥లో సిడిఎ నుండి ఐడిఎలోనికి మారినపుడు అందరు ఉద్యోగులకు నెలకు రూ. 1500 చెల్లించారు. కాని మేనేజ్‌మెంటు ఇతర ప్రభుత్వరంగ సంస్థలలో ఎలా చెల్లించారన్న అంశాన్ని పరిగణనలోనికికానీ, యూనియన్ డిమాండ్‌లనుకానీ, ఇతర అంశా లను కానీ పరిశీలించకుండా హేతుబద్ధంగా వ్యవహరించ లేదు. బిఎస్ఎన్ఎల్ సంస్థలోని సిఎండిగానీ, డైరెక్టర్లుగానీ, జిఎమ్‌లుగానీ, ఇతర అధికారులుగానీ, ఓఎన్‌జిసిలోని అధికారులతో సమానంగా వేతనాల సవరణ పొందినపుడు- ఓఎన్‌జిసిలోని నాన్-ఎగ్జిక్యూటివ్స్‌తో సమానంగా బిఎస్ ఎన్ఎల్‌లోని నాన్-ఎగ్జిక్యూటివ్స్ యొక్క ఇంటరిమ్ రిలీఫ్ ఎందుకు పొందగూడదు?

ఉన్నతస్థాయి అధికారులు అరియర్సు రూపంలో కనీసం ఆరు లక్షల రూపాయలు పారితోషికాన్ని పొందటాన్ని వదలి వేసినా, క్రిందిస్థాయి అధికారికి కనీసం లక్ష రూపాయలు అరియర్సుగా (40% ఇప్పటికే చెల్లించారు, మిగిలిన

60% 2008-09లో చెల్లిస్తారు) పొందుతున్నప్పుడు కనీసం అందులో సగం అడ్వాన్సుగా పొందడానికి నాన్ ఎగ్జిక్యూటివ్ అర్హుడు కాదా? నాల్గు నెలల బేసిక్ పేను అడ్వాన్సుగా ఇస్తూ బిఎస్ఎన్ఎల్ ఏకపక్షంగా జారీచేసిన ఉత్తర్వు ఉన్నత స్థాయి అధికారులకు ప్రాముఖ్యతనిచ్చే దాని ఆలోచనా విధానాన్ని, నాన్ ఎగ్జిక్యూటివ్స్ పట్ల నిర్లక్ష్య వైఖరినీ, మేనేజ్‌మెంటు యొక్క ఫ్యూడల్ మనస్తత్వాన్నీ తెలియజేస్తోంది. ఆధునిక, ప్రజాస్వామిక సమాజంలో మరీ ముఖ్యంగా ప్రభుత్వరంగంలో ఈ వైఖరిని సహించరాదు. పైన పేర్కొన్న అంశాలనన్నింటినీ దృష్టిలో వుంచుకొని ఇంటరిమ్ రిలీఫ్ విషయంలో మన డిమాండ్‌ను అంగీ కరించవలసి వుంది.

ఆరవ వేతన సంఘం సిఫార్సులను అనుసరించి ప్రభుత్వం హెచ్ఆర్ఏ రేట్లను ఎ1 సిటీలో 30%గానూ, ఎ, బి1, బి2 పట్టణాలకు 20%గానూ, సి మరియు అన్ క్లాసి ఫైడ్ ప్రాంతాలకు 10%గానూ, 1.9.2008 నుండి సవరిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. బిఎస్ఎన్ఎల్‌లో పనిచేస్తున్న డిఓటి అధికారులు 1.9.2008 నుండి ఇదేరకమైన సవరణతో హెచ్ఆర్ఏ రేట్లు పొందుతున్నారు. డిపిఇ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వరంగ సంస్థలలోని అధికారు లకు సవరించబడిన హెచ్ఆర్ఏ రేట్లు 26.11.2008 నుండి చెల్లించబడుతున్నాయి. 26.4.2002న డిఓటి ఉద్యోగుల స్కేల్సు సిడిఎ నుండి ఐడిఎ స్కేల్సుకి మార్చబడిన సందర్భంగా చేసుకున్న వేతన ఒప్పందాన్ని అనుసరించి బిఎస్ఎన్ఎల్‌లో 7.8.2002న జారీచేసిన ఉత్తర్వు నెం. బిఎస్ఎన్ఎల్/26/ఎస్ఆర్/2002 ప్రకారం అనెగ్జర్‌లోని పేరా 1 ఈ రకంగా వుంది.

"బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు హెచ్ఆర్ఏ రేట్లు 1.10.2000 నుండి సవరించబడిన వేతనాలపై కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏ రకమైన సవరణలతో కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇస్తుందో అదే విధంగా చెల్లిస్తారు."

కనుక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 1.9.2008 నుండి సవరించడినట్లుగానే బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు కూడా 1.9.2008 నుండి సవరించబడి హెచ్ఆర్ఏ రేట్లతో చెల్లిం చాలి.

1.1.2007 నుండి రివైజ్డ్ పే స్కేలులో బేసిక్ పే 5% ఇంక్రిమెంటు ఇవ్వాలి.

### *1.1.2007 నుండి ప్రమోషను సందర్భంగా రెండు ఇంక్రి మెంట్లు (బేసిక్ పే పై 10%) కలిపి ఇవ్వాలి*

ఓఎన్‌జిసి లాంటి ఇతర ప్రభుత్వరంగ సంస్థలలో ప్రమోషన్ ఇచ్చే సమయంలో సాధారణంగా ఇచ్చే వార్షిక ఇంక్రిమెంటు రేటుకు అదనంగా ఎక్కువ ఇంక్రిమెంటు ఇచ్చే విధానం అమలులో వుంది. కనుక బేసిక్ పే పై 10% (రెండు ఇంక్రిమెంట్లకి సమానంగా) ప్రమోషన్ పొందే సమ యంలో బెనిఫిట్ ఇస్తూ 1.1.2007 నుండి అమలయ్యేలా చూడాలని డిమాండ్ చేస్తున్నాం.

## పెన్షనరీ బెనిఫిట్స్

### *ఎ) బిఎస్ఎన్ఎల్‌లో విలీనమైన ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమంగా పెన్షనరీ బెనిఫిట్స్ సవరించాలి*

బిఎస్ఎన్ఎల్‌లో విలీనం అయిన డిఓటి ఉద్యోగుల పెన్షనరీ బెనిఫిట్స్, వారు డిఓటిలో మరియు బిఎస్ఎన్ఎల్ లో చేసిన మొత్తం సర్వీసుకు కలిపి, వారు రిటైరయ్యే సమ యంలోని సిసిఎస్ (పెన్షను) రూల్సుకు అనుగుణంగా రూలు-37ఎ సబ్ రూల్-8 ప్రకారం చెల్లిస్తారు. ఆ తరువాత డిఓపి & పిడబ్ల్యు ఉత్తర్వు నెం. 4/61/99-పి & పిడబ్ల్యు ద్వారా 28.12.2002న దీనికి ఒక వివరణ జత చేయబడింది. దీని ప్రకారం ఒకేసారి పదవీ విరమణ చెందిన కేంద్రప్రభుత్వ ఉద్యోగికి ఏ విధంగా పెన్షను లెక్కకడతారో బిఎస్ఎన్ఎల్ లో అదే తేదీన రిటైరైన ఉద్యోగి పెన్షను కూడా లెక్కించాలి.

ఆరవ వేతన సంఘం సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనరీ బెనిఫిట్స్ పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం పెన్షనరీ బెనిఫిట్స్ ఈ విధంగా పెంచబడ్డాయి.

ఎ) 20 సం॥లు సర్వీసు పూర్తిచేసిన ప్రతి ఉద్యోగికి పూర్తి పెన్షను చెల్లించాలి. అలాగే వీరి పెన్షను ఎమాల్యు మెంట్సులో 50%గానీ చివరి పదినెలల ఎమాల్యుమెంట్సు గానీ ఏది లాభదాయకంగా ఉంటే అది 2.9.2008 తర్వాత రిటైరైన వారికి చెల్లించాలి.

బి) 1.1.2006 తర్వాత రిటైరైన ఉద్యోగి డిసిఆర్‌జి సీలింగు గరిష్ట పరిమితి ప్రస్తుతం వున్న 3.5 లక్షల నుండి 10 లక్షలు పెంచబడింది.

సి) 1.1.2006 తర్వాత రిటైరైన లేదా మరణించిన వుద్యోగుల ఫ్యామిలీ పెన్షను సవరించబడిన రేట్ల ప్రకారం చెల్లించాలి.

డి) 1.1.2006 ముందు రిటైరైన లేదా మరణించిన ఉద్యోగులకు ప్రత్యేకమైన ఉత్తర్వులు ఇవ్వబడ్డాయి.

పైన పేర్కొన్న ఉత్తర్వులను అనుసరించి బిఎస్ ఎన్ఎల్‌లో విలీనమైన డిఓటి ఉద్యోగుల పెన్షనరీ బెనిఫిట్స్ ను సవరించవలసి వుంది. ఇంతే కాకుండా 1.9.2008 నాటి ఉత్తర్వు నెం. డిఓపి & పిడబ్ల్యు నెం. 38/37/08-పి & పిడబ్ల్యుఏ, సబ్‌రూల్-7 ప్రకారం 2006 కంటే ముందు రిటైరైనవారికి ఫ్యామిలీ పెన్షనర్ల పెన్షన్లను సవరించవలసి వుంది. అలాగే పిఎస్‌యులలో విలీనం కాబడి ప్రభుత్వం నుండి పెన్షను పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్లను కూడా పై ఉత్తర్వుల ప్రకారం సవరించవలసి వుంది. కానీ ఇంతవరకు ఇది అమలుపర్చబడలేదు.

బిఎస్ఎన్ఎల్‌లో విలీనం అయిన డిఓటి ఉద్యో గులు ఎవరైనా 1.10.2000 నుండి సిడిఎ నుండి ఐడిఎ స్కేల్సుగా మారిన సందర్భంలో డిఎ రేటు తగ్గింపు కారణంగా వారి పెన్షను కూడా తగ్గించబడింది. ఈ అంశం కూడా ఇంతవరకు పరిష్కారం కాలేదు. ఇదేరకమైన సమస్య ఆరవ వేతన సంఘం సిఫార్సుల అమలు ఆధారంగా వచ్చిన సందర్భంలో ఉత్తర్వు నెం. 38/37/08-పి&పిడబ్ల్యు తేది 2.9.2008 సబ్‌రూల్ 12 ప్రకారం ప్రభుత్వం సరిచేసింది. దీని ప్రకారం 1.1.2006 నాటి ఎమాల్యుమెంట్సుకు పే+డి.పి.+డిఎని అంతకుముందు కాలానికి కూడా సరిచూస్తూ సవరించాలి. ఐదవ వేతన సవరణ కమిటీ సిఫార్సుల అమలు సమయంలో కూడా ఉత్తర్వు నెం డిఓపి & పిడబ్ల్యు నెం 45/86/97-పి&పిడబ్ల్యు (ఎ) - పార్టు1, తేది 18.10.1999 ద్వారా ఈ వ్యత్యాసాలను సవరించారు.

*బి) బిఎస్ఎన్ఎల్‌లో నియమించబడిన ఉద్యోగులకు పెన్షను స్కీము రూపొందించాలి*

సిసిఎస్ పెన్షను రూల్సులోని రూల్-37(ఎ) సబ్ రూల్-23 ప్రకారం బిఎస్ఎన్ఎల్ ఏర్పడిన తర్వాత నియ మించబడిన ఉద్యోగులకు మేనేజ్‌మెంటు స్వంత పెన్షను స్కీమును రూపొందించుకొని దాని ప్రకారం పెన్షను నిధుల సేకరణ, పెన్షనరీ బెనిఫిట్స్ చెల్లింపులను రూపొందించు కోవాల్సి వుంది. యూనియన్ అనేక పర్యాయాలు ఈ అంశాన్ని లేవనెత్తినా, ఇంతవరకూ బిఎస్ఎన్ఎల్‌లో నియ మించబడిన ఉద్యోగులకు ఒక పెన్షను స్కీము రూపొం దించబడలేదు. ఇప్పటికైనా మేనేజ్‌మెంటు ఇటువంటి ముసాయిదా పెన్షను స్కీము రూపొందించి, గుర్తింపు పొందిన యూనియన్‌తో చర్చించి ఒప్పందం కుదుర్చుకున్న అనంతరం వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేస్తున్నాం.

*సి) పెన్షనర్లకు 50% డి.ఎ. మెర్జరు*

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు 1.1.2007 నుండి 50% డి.ఎ. వేతనంలో విలీనం చేశారు. అయితే బిఎస్ఎన్ఎల్‌లో రిటైరైన పెన్షనర్లకు ఈ విలీనం వర్తింపజేయబడలేదు. ఈ అంశాన్ని వెంటనే పరిష్కరించాల్సిన అవసరం వుంది.

## కాంట్రాక్టు/క్యాజువల్ కార్మికులకు సంబంధిత గ్రేడ్‌కు చెందిన రెగ్యులర్ ఉద్యోగుల కనీస వేతనంతో సమంగా వేతనం ఇవ్వాలి

కాంట్రాక్టు/క్యాజువల్ కార్మికులకు సంబంధిత గ్రేడ్‌కు చెందిన రెగ్యులర్ ఉద్యోగుల కనీస వేతనంతో సమానమైన వేతనం ఇవ్వాలన్నది నిర్ధారించబడిన విధానం. ప్రభుత్వరంగ సంస్థలు మార్గదర్శకాలుగా వుండాల్సిన దృష్ట్యా బిఎస్ఎన్ఎల్ ఈ విధానాన్ని వెంటనే అమలుచేయాల్సి వుంది.

## అధికారులతో సమానంగా అలవెన్సులు మరియు పెర్క్స్

ట్రాన్స్‌పోర్టు అలవెన్సు, ఆహార అలవెన్సు లాంటి ఇతర అలవెన్సుల విషయంలో అధికారులకు, నాన్ ఎగ్జిక్యూటివ్స్‌కు ఎలాంటి వ్యత్యాసం వుండాల్సిన అవసరం లేదు. ఎందుకంటే రవాణా, ఆహారం లాంటి వాటి రేట్లు అధికారులకు, నాన్ ఎగ్జిక్యూటివ్స్‌కు కూడా సమానమే కనుక. అలవెన్సులు మరియు పెర్క్స్ అధికారులతో సమానంగా నాన్ ఎగ్జిక్యూటివ్స్‌కు చెల్లించాలి.

*అభినందనలతో...*

**బి.ఎస్.ఎన్.ఎల్. ఎంప్లాయీస్ యూనియన్**

BSNLEU

**............................జిల్లా శాఖ**